భూమికి వున్నంత ఆకర్షణశక్తి భామకుంది. ఇది న్యూటన్ కనిపెట్టక ముందే మనవాళ్ళు కనిపెట్టేశారు. భూమిమీద నడుస్తున్నావంటే భూమి ఆకర్షణ శక్తికి లొంగిపోబట్టేకదా – అలాగే పెళ్ళానికి లొంగి పోవడం అన్ సైంటిఫిక్ కానేరదు. ఈ సృష్టిలో వైద్యం, కళలు, నేతపని. వ్యవసాయం, పరిశ్రమలు, వ్యాపారం ఆదిలో కనిపెట్టినది స్త్రీయేనని చాలా మందికి తెలీదు. సృష్టిని స్త్రీయే లొంగదీసుకుంది గనుక నువ్వో లెక్కకాదు. బేషరతుగా గృహ లక్ష్మికి లొంగిపో – మరి మాట్లాడకు, డోంటాక్!

# జాకెట్ రహస్యాలు

**జా**కెట్ రహస్యాలు రాకెట్ రహస్యాలకంటే గట్టివి. చంద్రమండలం చుట్టూ తిరిగే అద్భుత సాహసికికూడా మనో మండలంలో సతతం సంతసం కలిగించేది పెళ్ళాం ముఖ చంద్ర బింబవేకదా! అంచేత గిరీశం "ఇటీజ్ విమెన్ దట్ సెడ్యూస్ ఆల్ మేన్ కైండ్" అని వాపోతాడు. జంగిల్స్‌లోకి పోయి ముక్కు మూసుగున్న (పై ముక్కు.) మునులుకూడా తామరస నేత్రలిండ్ల బందాలుకారె... సంసార నౌక కంటె కూడా గట్టిది. "ఎంత, వారలైనా కాంతదాసులె" పొమ్మన్నాడు త్యాగరాజు, భూమి ఆకర్షణశక్తినుంచి ఛేదించుకుని మగాడు పైకి ఎగరగల్డేమోకాని, మళ్ళీ చచ్చినట్టు ఆడదాని ఆకర్షణకు లొంగి కుక్కిన పేనులాగ భూమి మీదకు దిగిరావలసిందే? "చుట్టి చుట్టి పక్షులెల్ల చెట్టు వెదకురీతి భువిని" ఎంతటి మొనగాళ్ళు సైతం రాకెట్ల బంధాల్నుండి విడివడ్డా జాకెట్ల బంధాల్నుంచి తప్పించుకు పారిపోలేరు. కొండమీద వెలసినది గ్రేట్ శ్రీనివాసుడు సైతం రోజూ కొత్తచెప్పులు తొడుక్కుని, ఏకాంత సేవలందుటకై కొండదిగి అమ్మవార్ని వెతుక్కుంటూ క్రిందకు రావలసిందేకదా! పెళ్ళాం మెళ్ళోని లాకెట్లో దాక్కోవడం రాకెట్లో పై కెళ్ళడం కంటె గొప్ప – తమతమ పెళ్ళాలకు జడిసి వాళ్ళు ఫామిలీ కక్ష్యకు (ఫామిలీ కక్షలు కావు) దూరంగా పోలేరు.

ఇల్లాళ్ళనువదిలేసి ఫామిలీకక్షల మూలంగా పారిపోయిన హీరోలు, సంసారం అంటే విరక్తి చెంది విరాగులుగా రంగు ఫిరాయించిన బాబాలు అయిదు రూపాయలకు ముక్తి మార్గాన్ని అప్లికేషన్ల వారీగా సీనియారిటీకం శూటబిలిటీ ప్రకారం బోధించే బూడిద బుస్సన్నలూ, వీళ్ళంతా "తామరస నేత్ర లిండ్ల బందాలు" కాకుండా తప్పించుగున్న వారేనా అంటే కారేమో! భూమ్యాకర్షణను రాకెట్లు త్రెంచినట్లు ఆడదాని ఆకర్షణను త్రెంచడానికి మార్గం లేదు. ముందు మెజారిటీ బేషరతుగా లొంగి పోవలిసిందే. తప్పించుకోటం మాట తరవాత సంగతి.

మొన్న తమ తమ భర్తలను అంతరిక్ష నౌకలో పైకి పంపించిన లేడీస్ ముగ్గురూ నిజంగా అపర సర్వమంగళలే. (మా వూళ్ళోనూ మొగుళ్ళను పైకి పంపించిన బ్రేవు లేడీస్ వున్నారు

కాని వాళ్ళవాళ్ళెవ్వరూ తిరిగిరాలేదు). మ్రింగెడివాడు విభుండని, మ్రింగెడిదియు గరళమనియు, మ్రింగుమనె సర్వమంగళ మంగళసూత్రమ్ము నెంత మది నమ్మినదో - అన్నాడు పొయెట్ పోతన్నగారు. పై ముగ్గురు పతివ్రతలూ తమతమ మంగళసూత్రాల్ని "అపోలో-8" కి ముడేసి క్షేమంగా వెళ్ళి లాభంగా తిరిగి రమ్మన్నారు మొగుళ్ళను.

వాళ్ళండీ లేడీస్ -

ఆ వారం రోజులూ వాళ్ళ గుండెలెలా టువ్వు టువ్వు మని కొట్టుకున్నాయో ఎవరైనా వూహించి చెప్పగల్రా? ఇదేవన్నా గుంటూరు బస్సెక్కడవా, అనకాపల్లి ప్రయాణవా, మైలెక్కడవా, రైలెక్కడవా? అలాటిలాటిది కాదేం- ఎకా యెకి పై కెళ్ళిపోవడం చంద్రుని దగ్గరకు. అప్పులు చేసి వూళ్ళోంచి పారిపోయేవాళ్ళు కూడా భూమ్యాకర్షణను, భామల ఆకర్షణను తప్పించుగోవాలనుకోరు. ఇటు స్త్రీ అటు డబ్బు ఆ పైన అధికారం ఈ మూడే గొప్ప ఆకర్షణలనుకుంటే వీటి నుంచి పారిపోయే మనస్తత్వంకంటే విజ్ఞానదాహంతో మనుష్యుడి గొప్పను బల్లగుద్ది అందరికంటె ముందుగా రుజువుపర్చడానికి ఆ ముగ్గురూ అపోలో-8లో పై కెళ్ళారు. దీనివల్ల తేలే రహస్యం ఏవంటే "పైకి రావాలంటే పైకెళ్ళాలిగాని యింట్లో గుడిపావులా కూర్చోకూడదు. మగాడు తిరక్కపోతే చెడతాడు కదా- అందుకనే అంతరిక్షంలో పైకెళ్ళి వాళ్ళు చంద్రుని చుట్టూ తిరగడం. తిరిగే రాకెట్టూ తిట్టే పత్రికా వూరుకోదు. మగాడు డెవిలే - అడ్వెంచర్ వాడి మొహాన్న రాసుంది. "గోడలు దూకడం దగ్గర్నుంచి." వెంకు పంతులుగారి కోడలికి లవ్ లెటర్ రాయడం వరకూ అడ్వెంచరే కదా!

కొందరుంటారు. వాళ్ళకు చేగోడీలు తింటూ మంచం విరిగేలా నిద్రపోవడమే జీవితలక్ష్యం. "ధైర్యే సాహసేలక్ష్మి" యిలాటి మాటలు వాళ్ళ చెవికెక్కవు. ఒత్తి మంటిబుక్కడాలు వీళ్ళు - మెజారిటి జనులు వీళ్ళే. చంద్రుడెలా వుంటే మనకెందుకు? బూడిదరంగులో ప్లాస్టరాఫ్ పారిస్‌లావున్నాడా - అది కనుక్కోడానికేనా పైకెళ్ళింది? అక్కడ నిశ్శబ్దంగా వుంటుందా - గాలి వుండదా - ఉష్ణోగ్రత రాత్రికీ పవలుకీ బ్రహ్మాండమైన వ్యత్యాసం వుంటుందా - చంద్రుడంటే బ్రహ్మాండమైన లోయలూ, కొండలూ, గోతులూనా... ఈ మాత్రం తెలుసుకోవడానికి పోలో మంటూ పెళ్ళాం బిడ్డల్నేడిపించి ఆ అపోలో-8లో పై కెళ్ళడం దేనికి? వీళ్ళంతా వీరులా? వీరులంటే ఇంట్లోవాళ్ళని ఏడిపించి మెప్పుకోసం పైవాళ్ళకి అడ్డమైన చాకిరీలు చేసేవాళ్ళనా అర్థం - మానవనాగరికత చరిత్ర అంతా యిటువంటి సాహసాల్తో కూడుకొన్నట్టిదేనా.... వ్యక్తులసాహసాలు చరిత్రలో సువర్ణాక్షరాలతో కంపోజ్ చేస్తారట. మనుష్యుని కెప్పుడూ కొత్త అంటే వెర్రి సరదా - కొత్త ఆడదానికోసం వెర్రిగా ఎగబడ్డం అందుకేనేమో. మనుష్యుడి పెళ్ళానికి వున్నది వూడిపోకుండా అంటిపెట్టుకుని జీవించడంలోనే తృప్తి. ఆస్తి కనిపెట్టినది ఆడది, అడ్వంచర్ అంటే వాడికెంత యిష్టమో, వున్నదాన్ని పెంచి పోషించడవంటే 'దాని' కంత యిష్టం.

అప్పుడప్పుడు నాక్కూడా యీ డాం రొటీను నుంచి ఎక్కడికైనా ఎగిరిపోవాలనుంటుంది. మావారు "అపొలో ట్వెల్వ్"లో ప్రయాణం పెట్టుకున్నట్లు డాం బిజీగా వుంటారు. నాకేవీ తోచనపుడు సాహసాలు చెయ్యాలనిపిస్తుంది. కొత్త కొత్త లోకాలను అవలోకించాలనిపిస్తుంది. అప్పుడు నేను నడువెక్కి కూర్చున్న నవారుమంచవే నా అంతరిక్షనౌక. నా బుర్రలో చాలా స్క్రూలున్నాయి. అవి కొన్ని లూజ్‌చేస్తే అంటే మనసుని అలా గాలికి వదిలేస్తే (చంద్రమండలంలో గాలికూడా లేదట. గాలి పోగుచేసి అక్కడికి పంపించే బిజినెస్ ఒహటి పెట్టమని గవర్మెంటాఫిండియాకో, అమెరికాకో లెటర్ ఒహటి రాయాలి) నోటికి వేరుశెనక్కాయలో, జీళ్ళో, తేగలో అందిస్తే.... నా మైండ్ ఏయే లోకాలకు వెళ్తుందో నే నిప్పుడు చెప్పలేను. మనోజవం మారుత తుల్యవేగం అన్నారు కదా – మైండుతో సందర్శించలేనిదంటూ వుండదు. మైండుండబట్టేగదా మేటరూ – వుండండి సార్! జస్టెమినిట్... మన దేహాల్ని కూడా అంతరిక్షనౌకలనవచ్చుకదా – అవేకదా మనల్ని ఎప్పుడో ఒహప్పుడు అంతరిక్షానికి అంటే కైలాసవో, వైకుంఠవో తీసికెళ్ళేది. సంసారమనే ఈ అశాంతి సాగరంలోపడి కొట్టుకొంటున్న ఈ దేహాన్ని విడిచి జీవుడు అంతరిక్షంలోకి వెళ్ళడం సెంట్ పరసెంట్ ఖాయంగనుక. అంతరిక్ష నౌక మనం ఎక్కలేదే అని ఎవరూ విచారించకండి.

కాని ఒక చిన్న కిటుకుంది.

మన అంతరిక్షనౌక మళ్ళీ భూమ్మీదకు తిరిగిరాదు. మన తర్వాత పడవ ఎక్కేవాళ్ళు మన్ని ఏట్లోకో కాట్లోకో తోస్తారు. అంతే. టేకిట్ ఈజీ!

# ప్రేమకి మీసాలు

"కలకలలాడు వాలుజడకై
జగమెంత తపస్సొనర్చెనో"

అంటాడు కవి. అప్పుడప్పుడు జడ "చెలియ భుజానవ్రాలి కుచసీమ నటించుచు" ముందుకు వచ్చినా పాపం మళ్ళీ వెనక్కు విసురుగా వెళ్లి "కటిసీమ"ను నడయాడకతప్పదుకదా! ప్ఫ్! స్త్రీ సౌందర్య సుకుమార వయోవిలాస విభ్రమాదులకు ఆమె వయ్యారాల వాల్జడే సాక్షి. కాని ఈ జడ ఇలా పాపం వెనక్కే ఎందుకు వుండిపోయిందీ అని అస్మదాదులకో అనుమానం!

ఇంత డేంజరస్ ఇన్‌స్ట్రుమెంటు కదా ఈ వయ్యారాల వాల్జడ, దీన్ని అస్తమానూ వయో విలాసినులు ఉపయోగించకుండా కొంచెం వెనక్కే అసింటా అట్టేపెట్టడం ఒకవిధంగా దూరదృష్టితో ఆలోచించి చేసిన పనిలా తోస్తుంది. కళ్ళకు కట్టే కమనీయ సౌందర్యవంతా ముందుంచి దీన్ని కాస్త వెనక్కు నెట్టెయ్యడంలో సృష్టికర్త తెలివైన పనే చేశాడు. ఆడవాళ్ళు